# సన్ స్ట్రోక్

" విశ్వం వచ్చాడా ?" నీరసంగా అడిగాడు నారాయణ - సన్ స్ట్రోక్ నుండి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాడు.

" రాలేదు " నర్సు చెప్పింది.

" తీరిక దొరకలేదా? నర్స్ ! ఆ నెంబరుకు ఫోన్ చేసి చెప్పావా?" ఆశగా అడిగాడు నారాయణ.

" ఆ ! చెప్పాను సార్ - ఏవో అర్జెంటు పనులున్నాయట ! వీలు చూసుకుని వస్తానని చెప్పారు." నర్సు అబద్ధం చెప్పింది.

" నా తృప్తి కోసం ఇంకొక్కసారి ఫోన్ చెయ్యమ్మా " దీనంగా అడిగాడు నారాయణ.

నర్సు తలూపి రిసెప్షన్ దగ్గరికి వెళ్ళింది. నెంబరు చూపించి కనెక్షన్ ఇమ్మంది. అటు వైపు రింగయింది.

" హలో ! విశ్వం ఇండస్ట్రీస్ హియర్-" రిసెప్షనిస్టు చెప్పింది.

" విశ్వం గారు కావాలి !" నర్సు మేరీ చెప్పింది.

" వారు మీకేమవుతారు -" అట్నించి ప్రశ్న.

" నాకేమీ కారు - పనుంది" చెప్పింది మేరి.

" సారీ ! ఆయనతో మాట్లాడాలంటే రెండు రోజుల ముందు అప్పాయింట్‌మెంట్ తీసుకోవాలి - హి ఈజ్ నాట్ ఏన్ ఆర్డినరీ పర్సన్ ! హి ఈజ్ ది చైర్‌మెన్ ఆఫ్ విశ్వం ఇండస్ట్రీస్ - టర్న్ ఓవర్ తెల్సా - సమ్ థా జంప్స్ ఆఫ్ కోర్స్! కోట్ల మీద వ్యాపారం - అయన సమయం చాలా అమూల్యం - ఆయనతో మాట్లాడ్డం కుదరదు" అట్నించి ఆమె కరుగ్గా చెప్పింది.

" ప్లీజ్ ! ఒక్కసారి ఆయన్ను అపోలో హాస్పిటల్‌కు రమ్మనండి - చాలా అర్జెంటు." మేరి బ్రతిమాలింది.

" ఎవరు మీరు ? అంత అర్జెంటు పనేంటి? "

" అది పర్సనల్ - మీకు చెప్పాలా?"

" ఓకే - ఆయన సెక్రటరీకి కనెక్షన్ యిస్తాను మాట్లాడండి !" కాసేపు మ్యూజిక్ వచ్చింది... తరువాత 'హలో' అని వినిపించింది.

" విశ్వంగారితో అర్జెంటు పని ఉంది... ఆయన్ను ఒక్క సారి అపోలో హాస్పిటల్‌కు రమ్మని చెప్పగలరా?"

" సారీ ! ఆయన ఎంగేజ్‌మెంట్సులో అవేమీ లేవు –" సెక్రటరీ చాలా కూల్‌గా చెప్పింది.

విశ్వం వచ్చాడా? " నీరసంగా అడిగాడు నారాయణ సన్‌స్ట్రోక్ నుండి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాడు.

" రాలేదు." నర్సు చెప్పింది.

అతను అలా అడగడం ఏ వందో సారో – ఆమె చెప్పడం కూడా అంతే !

" తీరిక దొరకలేదా? నర్స్ ! ఆ నెంబరుకు ఫోన్ చేసి చెప్పాలా?" ఆశగా అడిగాడు నారాయణ.

" ఆ ! చెప్పాను సార్ – ఏవో అర్జెంటు పనులున్నాయట ! వీలు చూసుకుని వస్తానని చెప్పాడు." నర్సు అబద్ధం చెప్పింది.

" నా తృప్తి కోసం ఇంకొక్క సారి ఫోన్ చెయ్యమ్మా ! " దీనంగా అనిగాడు నారాయణ.

నర్సు తలూపి రిసెప్షన్ దగ్గరికి వెళ్ళింది. నెంబరు చూపించి కనెక్షన్ యిమ్మంది. అటువైపు రింగయింది.

" హలో ! విశ్వం యిండస్ట్రీస్ హియర్–" రిసెప్షనిస్టు చెప్పింది.

" విశ్వం గారు కావాలి !" నర్సు మేరీ చెప్పింది.

" వారు మీకేమవుతారు –" అట్నించి ప్రశ్న.

" నాకేమీ కారు ... పనుంది " చెప్పింది మేరీ.

" ఈసారి ! విశ్వం గారితో మాట్లాడాలంటే రెండు రోజుల ముందు అప్పాయింట్‌మెంట్ తీసుకోవాలి – హి ఈజ్ నాట్ ఏన్ ఆర్డినరీ పర్సన్ ! హి ఈజ్ ది చైర్‌మెన్ ఆఫ్ విశ్వం ఇండస్ట్రీస్ – టర్న్ ఓవర్ తెల్సా – సమ్ థౌ జంప్స్ ఆఫ్ కోర్స్! కోట్ల మీద వ్యాపారం – అయన సమయం చాలా అమూల్యం – ఆయనతో మాట్లాడ్డం కుదరదు" అట్నించి ఆమె కరుగ్గా చెప్పింది.

" ప్లీజ్ ! ఒక్కసారి ఆయన్ను అపోలో హాస్పిటల్‌కు రమ్మనండి – చాలా అర్జెంటు." మేరి బ్రతిమాలింది.

" ఎవరు మీరు ? అంత అర్జెంటు పనేంటి? "

" అది పర్సనల్ – మీకు చెప్పాలా?"

" ఓకే – ఆయన సెక్రటరీకి కనెక్షన్ యిస్తాను మాట్లాడండి !" కాసేపు

మ్యూజిక్ వచ్చింది... తరువాత 'హలో' అని వినిపించింది.

" విశ్వంగారితో అర్జెంటు పని ఉంది... ఆయన్ను ఒక్కసారి అపోలో హాస్పిటల్‌కు రమ్మని చెప్పగలరా?"

" సారీ ! ఆయన ఎంగేజ్‌మెంట్సులో అవేమీ లేవు –" సెక్రటరీ చాలా కూల్‌గా చెప్పింది.

" కనీసం మధ్యాహ్నంకు రమ్మనండి..." నర్సు దీనంగా అడిగింది.

" కుదరదు.... ఆయన ఫ్లైట్‌లో అమెరికా వెళుతున్నారు. మళ్ళీ వారం దాకా రాలేరు.... బిజినెస్ టూర్ !" చెప్పింది సెక్రటరీ.

" అయ్యో ! కొంపలంటు కుంటాయి. చాలా అర్జెంటు... మీరు చెప్పకపోతే తరువాత ఆయన మిమ్మల్ని నిందించవచ్చు." బెదిరించింది.

" ఇంతకీ విషయం చెప్పు –" విసుగ్గా అడిగింది సెక్రటరీ.

" అపోలోలో వాళ్ళ నాన్నగార్కి సీరియస్సుగా ఉంది..." మేరీ చెప్పింది నింపాదిగా.

" ఏం జరిగింది?" తాపీగా అడిగింది సెక్రటరీ.

" హార్ట్‌ఎటాక్ అండ్ సన్ స్ట్రోక్! ... .కొన్ని రోజులు గడిస్తే ఏమీ చెప్పలేం అని కార్డియాలజిస్టు అంటున్నారు...."

" ఎన్నాళ్ళయింది?"

" రెండు రోజులైంది... రెండు రోజులుగా ఫోన్ చేస్తూనే ఉన్నాను - కనెక్షన్ దొరకడం లేదు – దొరికినా సరైన రెస్పాన్సు ఉండటం లేదు... ఆయనేమో మెలకువ వచ్చినప్పుడల్లా అడుగుతున్నారు" వాపోయింది మేరీ.

" ఈజిట్ ! అంత సీరియస్సా – ఓ వారం తర్వాత చూడకూడదా?"

" అవసరం ఉండకపోవచ్చు."

" ఓకే ! ఆయన బోర్డు ఆఫ్ డైరెక్టర్ల మీటింగులో వున్నారు... ఏ మాత్రం వీలు చిక్కినా చెబుతాను... బైదిబై రూము నెంబరు అవి చెప్పండి..." సెక్రటరీ అడిగి నోటు చేసుకుంది...

మేరీకి అప్పుడప్పుడు అనుమాన మొస్తూ ఉంటుంది... నారాయణ మతి చెలించి ఈ నెంబరు యిచ్చాడా అని ... నిజంగా ఆయనకు ఈయన తండ్రా – ఈయన కొడుకు ఆయనేనా అని !

మధ్యాహ్నం రెండు గంటలకు ఆ హాస్పిటల్ రెడ్ అలర్ట్ అయింది. హై సెక్యూరిటీ ఏర్పాట్లు జరిగాయి.

బూట్లు టకటకలాడిస్తూ విశ్వం నారాయణ ఉన్న గదిలోకి వచ్చాడు. నారాయణ

మంచం పక్కన కుర్చీలో కూర్చున్నాడు.

" డాడీ ! నేను వచ్చాను - ఎలా వున్నావు?" అడిగాడు విశ్వం.

నారాయణ ఆ మాటలకు మెల్లగా కళ్ళు తెరిచాడు.

" బాబూ ! విశ్వం ! " కన్నీరు కార్చాడు లేవలేక...

విశ్వం వచ్చాడని తెల్సి డాక్టర్లందరూ పరుగెత్తుకుంటూ వచ్చారు.

" ఎలా వుంది డాడీకి?" విశ్వం అడిగాడు చీఫ్‌ను చూసి.

డాక్టరు ఎక్స్‌ప్లెయిన్ చేశాడు. కొంచెం కోలుకున్న తర్వాత గుండెకు ఆపరేషన్ చెయ్యాలని, ఎటొచ్చీ ఈ వయసులో తట్టుకోగలడా, లేదాని తటపటాయిస్తున్నారు.

" చూడండి డాక్టర్ ! ఎన్ని లక్షలయినా ఫర్వాలేదు - డాడీకి మంచి ట్రీట్‌మెంట్ యివ్వండి... మీ నైపుణ్యం అంతా చూపించండి... అవసరమయితే ముంబై నుండి గాని - అమెరికా నుండి కాని స్పెషలిస్టులను పిలవండి ఖర్చు భరిస్తాను... బట్ ... ఆయన జీవించాలి!" విశ్వం ఆదేశించాడు... ఎన్నో కెమెరాలు క్లిక్ మన్నాయి.

" మా శాయశక్తులా ప్రయత్నిస్తాం... డోంట్ వర్రీ !"

" డాక్టర్ ! నాకు ఫ్లైట్‌కు టైమవుతున్నది - అమెరికా వెళ్ళాలి అర్జెంటు పనిమీద - ఓ వారం పడుతుంది... వచ్చేసరికి నవ్వుతూ కనిపించాలి డాడీ ! ఓకే ! డాడీ ! నాకు సెలవిప్పించండి... ఈ కార్డు మీదగ్గర పెట్టుకోండి... ఇంటి అడ్రసు - టెలిఫోను నెంబర్లున్నాయి." ప్రేమగా తలనిమిరి విశ్వం బయలు దేరిపోయాడు.

ఆయన వెంబడి ఆయన పరివారం - ఆయన సెక్యూరిటీ గార్డులు - డాక్టర్లు వెళ్ళిపోయారు.

నారాయణ గొప్పతనం మేరీకి తెల్సివచ్చింది - ఒంటరిగా వచ్చి హాస్పిటల్‌లో అడ్మిట్ అయితే దిక్కులేని వాడనుకుంది.. కాని ఆయన వెనుక ఇంత బలగం ఉందన్నమాట

ఆ రోజునుండి స్పెషల్ కేర్ తీసుకోసాగింది ఆసుపత్రి సిబ్బంది నారాయణ గురించి.

ఓ నాలుగు రోజుల్లో కోలుకున్నాడు... సర్జరీ గురించి డాక్టర్లు ఇంకా ఓ నిర్ణయానికి రాలేక పోయారు. సాధారణ పేషంటు అయితే ఎప్పుడో కోసి పారేసేవారు. కాని వి.ఐ.పీ. అటు యిటు జరిగితే చెడ్డపేరు, కోర్టు తలనెప్పులు.

కోడలుకు ఫోన్ చేశాడు.

" హలో - చంద్రకళా - నేనమ్మా - మామయ్యని. అపోలోలో వున్నాను. నీకు చాలాసార్లు కబురు పంపించాను. వస్తావని ఎదురు చూశాను" బరువుగా చెప్పాడు నారాయణ.

" నాకు తీరిక లేదు – మామయ్యగారు ! పేపరు చూడ్డం లేదా? ఎన్ని ప్రోగ్రాముల్లో పాల్గొంటున్నానో! వీలు చూసుకుని వస్తాను" అట్నించి లైను కట్టయింది.

నారాయణకు తెల్సు ! ఆమె రాదని ! అయినా ఆశ ! మానవత్వం మీద కొంచెం ఆశ !

నిజానికి డాక్టర్లు ఇంటి దగ్గర రెస్టు తీసుకోవచ్చని చెప్పారు. కాని ఈ ఊళ్ళో కొడుకు పేరు మీద కోటలాంటి ఇల్లు వున్నా దానిలో తనకు ఓ చిన్న రూము కూడా లేదు – అందుకే హాస్పిటల్‌లోనే కాలక్షేపం చేస్తున్నాడు.

భార్య రాలేదు – ఆమె సుస్తీ మనిషి. నౌకర్లు రావలసిందే చూడటానికి. లేదా ఫోన్‌లో పలకరింపులే! గతంలోకి వెళ్ళాడు నారాయణ.

కొడుకు యింటికి ఒక్కసారి గృహ ప్రవేశం కొచ్చారు.

ఆ తర్వాత ఒకసారి తన భార్యను చెకప్ చేయించుకుందామని వచ్చాడు....

ఆ రోజు భోజనంలో నెయ్యి వడ్డించలేదు వంటవాళ్ళు... భక్ష్యంలో నెయ్యి వేసుకుంటే బాగుంటుంది.

" నెయ్యి కావాలి !" అని నోరు తెరిచి అడిగింది లక్ష్మీదేవి.

" అయిపోయింది అత్తయ్యగారు – ఈ ఒక్క పూటకు సర్దుకోండి" కోడలు చెప్పింది.

నెయ్యి లేంది ముద్దదిగదు లక్ష్మీదేవికి. కాని ఎలాగో కష్టపడి భోజనం చేసింది. కొంత వదిలేసింది.

ఆ తర్వాత కోడలు వాళ్ళు తింటున్నారు.

నీళ్ళ కోసం వచ్చిన లక్ష్మీదేవికి కోడలు గిన్నెడు నెయ్యి కంచంలో గుమ్మరించుకోవడం కనిపించింది – మనసు విలవిలలాడింది.

పందలకోట్ల ఆస్తిని కొడుక్కు ధారపోశాడు నారాయణ. అటువంటిది ఒక్క చెంచా నెయ్యి వడ్డించలేక పోయింది కోడలు. తను ఈ రోజు అనుభవిస్తున్న ఆస్థి తమది. ఆ మాటకొస్తే చంద్రకళ పేదింటి అమ్మాయి – ఎవరి పెళ్ళిలోనో చూసి ప్రేమించాడు విశ్వం. విశ్వం మాటను కాదనలేక – సిరులదేముంది – గుణం ప్రధానం అని ఆ పెళ్ళి జరిపించాడు. పేదవాళ్ళంతా మంచోళ్ళు – విశాల హృదయాలు కారని చంద్రకళను చూసిన కొన్నాళ్ళకే తెలిసిపోయింది.

చంద్రకళ తమనే కాదు – తన తల్లిదండ్రులను తన బంధువులను కూడా లక్ష్యపెట్టదు. ఎటొచ్చీ తన కొడుకును కొంగున కట్టేసుకుంది.

చంద్రకళ పుట్టింట్లో ఎలా ఉండేదో తాము చూడలేదు కాని, ఇక్కడి కొచ్చింతర్వాత

మహారాణి దర్జా ఒలకబోస్తున్నది. క్షణం తీరికలేని జీవితాన్ని గడుపుతున్నది. నారాయణకు గతం తల్చుకుంటే తీరని వ్యథ!

మళ్ళీ ఆ సాయంత్రం కోడలుకు ఫోన్ చేశాడు.

" అమ్మా ! చంద్రకళా ! ఒక్కసారి వచ్చిపోవూ!"

" వద్దామనే ఉంది... ఏదీ ఈ ప్రజలతో ఒకటే చిక్కు ప్రతిదానికి నన్నే పిలుస్తారు. తెంచుకోవడం కష్టంగా ఉంది... లేకపోతే నిరుత్సాహ పడతారు.."

" మనవడు - మనవరాలన్నా వచ్చి చూసి పోతారా!"

" రాజు ఎడ్యుకేషన్ టూర్‌కు వెళ్ళాడు... ఇందిరకు పరీక్షలు జరుగుతాయి కొన్ని రోజుల్లో - అది చదువులో చాలా బిజీగా ఉంది - నీతో మాట్లాడటానికే దానికి తీరికలేదు-" చెప్పింది చంద్రకళ.

" పోనీ ! నేను వచ్చి వెళ్ళనా ?" ఆశగా అడిగాడు నారాయణ.

" అయ్యయ్యో ! మీకెందుకు శ్రమ - మేమే తీరిక దొరికినప్పుడు వచ్చి చూస్తాం - బై !" ఫోన్ పెట్టేసింది - కాని లైన్ కట్ కాలేదు.

" అబ్బబ్బ ! ఈ ముసిలాళ్ళు ఎప్పుడు ఛస్తారో తెలియదు - మనల్ని చంపుకు తింటారు - నేను వచ్చి ఏం చేయాలిట! పోనీ ఆయనొచ్చి ఏం చేస్తాడట !" విసుక్కుంటున్నది ఎవరితోనో.

ఒక మొగ గొంతు హ హ అని నవ్వుతున్నాడు.

వినలేక ఫోన్ కట్ చేశాడు నారాయణ.

తన తండ్రి సంపాదించిన ఆస్థిని తను రెక్కలు ముక్కలు చేసుకుని బ్రహ్మాండంగా పెంచాడు. ఆస్థి పెరగడానికి కారణం తన పట్టుదల - కృషి - అదృష్టం - అన్నీ కల్సివచ్చాయి.

ఆంధ్రదేశంలో పెద్ద కోటీశ్వరుడుగా పేరు గడించాడు.

అన్నదమ్ములు కొట్లాడుకుంటూ ఉంటే అందరికీ సమానంగా ఆస్థి పంచిపెట్టాడు. తను మటుకు ఒక పెద్ద ఇల్లు తమ ఊళ్ళో ఉంచుకున్నాడు. కొంత క్యాష్ పెట్టుకున్నాడు.

విశ్వం తన వాటాను బాగా పెంచుకున్నాడు వ్యాపారం ద్వారా.

మిగతా ఇద్దరు కొడుకులు ఫారిన్‌లో సెటిలయ్యారు - వ్యాపార బాధ్యతలు బావమరదళ్ళకు యిచ్చి. ఎప్పుడన్నా ఇండియాకు వస్తారు. వచ్చినా తమతో ఒక్క గంట కూడా సరిగా గడపరు.

నారాయణ బాధతో తనగతం తల్చుకుంటూ ఉంటే గుండెల్లో చిన్నగా నెప్పి వచ్చింది. మొహమంతా చెమటలు పట్టేసింది.

మేరీ గమనించి డాక్టర్లకు కబురందించింది. వాళ్ళు ఆఘమేఘాల మీద వచ్చి ట్రీట్‌మెంటు యిచ్చారు.

" మనం నెగ్లెక్టు చేస్తే లాభం లేదు – సర్జరీ చేయాల్సిందే ?" ఓ డాక్టరు తేల్చి చెప్పాడు.

" కాని వాళ్ళ కొడుకు అమెరికా నుండి ఇంకా రాలేదు –ఏమైనా జరిగితే మనదే బాధ్యత అంటే..." ఇంకో డాక్టరు సందేహం –

" ఒక వేళ మనం చెయ్యకపోయినా – ఏమైనా జరిగితే మనదే బాధ్యత అని కోర్టులో వేస్తే !" ఇంకో డాక్టరు...

" ఆల్‌రైట్ ! ఆయన కోడలుంది కదా ! ఆమెతో పర్మిషన్ తీసుకుందాం..." పెద్ద డాక్టరు చెప్పాడు.

మేరీ అతి కష్టంమీద చంద్రకళను ఫోన్‌లో కలిసింది....

" మీమామ గార్కి ఆపరేషను చెయ్యాలి – కొన్ని కాగితాల మీద సంతకం చెయ్యాలి – మీరు ఒక్కసారి హాస్పిటల్‌కు రావాలి!" చెప్పింది.

" నేను సంతకం చెయ్యకపోతే చెయ్యరా!"

" ఊహూ ! రూల్సు ఒప్పుకోవు..."

" అయితే చావనీ – నాకు తీరిక లేదు – ఇక్కడ మా అన్న కూతురు బర్తుడే ఫంక్షను జరుగుతున్నది–" చంద్రకళ చెప్పింది.

" అర్జెంటుగా ఆపరేషను జరగకపోతే కూడా డేంజరే మేడం!" మేరీ వేడుకోలుగా అంది.

" అరే ! ఇంత చిన్న విషయానికి నాకు ఫోన్ చెయ్యాలా. ఏదొకటి చేసి పారేస్తే పోయేది – భూమ్మీద నూకలుంటే బ్రతుకుతాడు – లేకపోతే లేదు – ఇంత చిన్న దానికి నాటైం వేస్టు చేయాలా?" చంద్రకళ ఫోన్ పెట్టేసింది.

" విశ్వం వచ్చాడా !" నారాయణ అడిగాడు.

" అమెరికాలో వున్నాడు – రాలేదు " మేరీ చెప్పింది.

" పోనీ ! కోడలు పిల్ల వచ్చిందా?" నీరసంగా అడిగాడు.

" ఆమె కూడా ఊళ్ళో లేరు –" అబద్ధం చెప్పింది మేరీ.

" నాకు తెల్సు.. ఉన్నా రాదు – నాకెవరూ లేరు – అందరూ ఉన్నా అనాధని! ఈ ముసలాడితో వాళ్ళకేం పని. ఎంత సేపటికి వాళ్ళ షికార్లు – సరదాలు –" ఏడ్పు వచ్చింది నారాయణకు.

" ప్లీజ్ ఊరుకోండి" మేరీకి కూడా ఏడ్పు వచ్చింది.

" పోనీ ! నా భార్య వస్తుందేమో కనుక్కో ఫోన్ చేసి... " చెప్పాడు.

మేరీ ఫోన్ చేసింది లక్ష్మీదేవికి... తనకి బాగోలేదని చెప్పింది. అయినా అంబులెన్సులోనన్నా వస్తానని చెప్పింది లక్ష్మీదేవి.

లక్ష్మీదేవి రాగానే ఆపరేషన్ చేశారు...

లక్ష్మీదేవి కూడా ఆ రూము పక్కనే అడ్మిట్ అయింది. ఆమెకు లేని జబ్బులు లేవు. అన్నింటికి మించి మానసిక వ్యథ !

ఇన్నేళ్ళు పెంచి కొడుకుల్ని కోడళ్ళ చేతుల్లో పెట్టామే వాళ్ళు తమను సరిగా చూడ్డం లేదని బాధ !

" ఏవండీ ! మీకేం కాదండీ !" లక్ష్మీదేవి నారాయణ స్పృహలోకి వచ్చింతర్వాత ఏడ్చింది...

" నాకేం కాదే ! నా బాధంతా నీ గురించే ! కనీసం నాగురించి ఆలోచించేందుకు నువ్వున్నావు – నీ గురించి ఆలోచించేందుకు నేనున్నాను. మనలో ఎవరు పోయినా మనల్ని గురించి ఆలోచించే ఇంకెవరూ మిగలరు. అదే నాబాధ!" నారాయణ కంటతడి.

" ఇంత బ్రతుకు బ్రతికి ఇలా దిక్కులేనట్లు హాస్పిటళ్ళలో పడిగాపులు కాయాల్సి వచ్చింది! కోడలుకు ఫోన్ చేస్తే రాలేదు. కనీసం మనవడ్ని – మనవరాల్ని పంపలేదు – పంపితే మన చెడ్డబుద్ధులే వస్తాయని ఎవరితోనో అంటూంటే వినిపించింది" వెక్కి వెక్కి ఏడ్చింది లక్ష్మీదేవి.

" ఊరుకోవే ! వందల కోట్ల ఆస్థి తీసుకున్న కన్న కొడుక్కే – మనపైన ప్రేమ అభిమానం లేనప్పుడు పరాయి వాళ్ళకు ఎలా ఉంటాయి? కొడుకులనైతే కన్నాం కాని వారితో పాటు కాస్త మమకారాన్ని ప్రేమల్ని కనలేక పోయాం! ఇప్పుడు ఏడిస్తే ఏం లాభం!" నారాయణ చిన్నగా చెప్పాడు – ఆయాసపడుతూ.

" మీరు ఆలోచించవద్దండి – డాక్టర్లు మీకు పూర్తి రెస్టు కావాలన్నారు–" లక్ష్మీదేవి ఏడుస్తూ చెప్పింది.

" ఆ రెస్టు వీళ్ళెవరూ యివ్వలేరు – కేవలం పైవాడివ్వాల్సిందే!"

ఓ రెండు రోజుల తర్వాత విశ్వం ఇండియా చేరుకున్నాడు. పత్రికా విలేఖరులు అతన్ని ప్రశంశలతో ముంచెత్తారు.

" పని పట్ల మీకున్న అంకిత భావం ఈ దేశం గర్వించ దగింది... నాన్న గారికి సీరియస్‌గా ఉన్నా కూడా ఏ మాత్రం చలించకుండా వ్యాపార ఒప్పందాలు పూర్తి చేసుకుని వచ్చారు!"

విశ్వం తండ్రిని చూడ్డానికి వచ్చాడు... ఆయన పరివారం రూము బయట

ఉండిపోయింది.

నారాయణ విశ్వంను చూడగానే కన్నీళ్ళు కురిపించాడు. దగ్గరకు రమ్మని సైగ చేశాడు.

" బాబూ ! బాగున్నావా ?"

" ఆ ! నాకేమయింది - బాగున్నా !" చెప్పాడు.

" విస్సూ ! మీ నాన్నకు నీ గురించే దిగులురా - ఎంతో మంది వచ్చి చూసి పోతున్నారు కాని నువ్వు - కోడలు - మనవలు - మనవరాళ్ళు రాలేదని ఒకటే దిగులు పడతారు. తల్లి లక్ష్మీదేవి చెప్పింది కొడుకు చేతుల్ని పట్టుకుని.

" అదికాదే ! వాళ్ళకంటే పన్లుండవు -ఎల్లప్పుడూ యిక్కడే ఉండమన్నా ఉంటారు - కాని నాకెలా కుదురుతుంది. అయినా మన నౌకర్లు విచారిస్తూనే ఉన్నారుగా - నేను కూడా వాళ్ళనడిగి తెల్సుకుంటూనే ఉన్నా" చెప్పాడు విశ్వం...

" ఒరే ! అంత బిజీ అయిపోయావా ! ఇంత వాడివిగా వున్నప్పుడు ఆయనమీద ఎక్కి ఆడుకునే వాడివి. వద్దంటే నా పాలన్నీ తాగేసేవాడివి. ఇప్పుడు పెద్దోడివై పోయావు. మమ్మల్ని చూడ్డానికి కూడా టైం దొరకడం లేదు- నీ షెడ్యూలులో - ఓ గంట ఈముసలాళ్ళ కోసం కేటాయించరా!" తల్లి దీనంగా అడిగింది.

" అమ్మో ! గంటే ! ఇప్పుడు రావడానికే ఎన్నో ప్రోగ్రాంలు మార్చుకోవాల్సి వచ్చింది. ఒక్క గంటలో నా సంపాదన ఎంతో మీకు అర్థం కాదు. అయినా నే వచ్చి ఏం చేయాలి ! నేనేమన్నా డాక్టరునా ? ఇక్కడ ఇంతమంది డాక్టర్లు, నర్సులు ఉన్నారుగా." విసుక్కున్నాడు విశ్వం.

" ఒరే ! కోడలు ఒక్కసారి కూడా రాలేదురా ? నీకంటే సంపాదన? ఆమెకేమయిందిరా ?" తల్లి నిష్ఠూరంగా అడిగింది.

" సరేలే ! నాకంటే బిజీ తను, సంఘసేవా కార్యక్రమాల్లో క్షణం తీరికుండదు. పేపరు చూడటం లేదా - ఆమెకు ఎన్ని బిరుదులొచ్చాయో చూడలేదా - ప్రజాబంధు, దీనరక్షక, సేవారత్న ఇలా ఎన్నో బిరుదులు అనేక సంఘాలు ప్రధానం చేశాయి" చెప్పాడు ఆమెను సమర్థిస్తూ....

" ఆమె సేవచేసే ప్రజల్లో మా పేరుకూడా చేర్చుకోమనురా!" నారాయణ చెప్పాడు బాధగా.

" అబ్బబ్బ ఆమెది ! ఆమెది నిస్వార్థ సేవ ! మనవాళ్ళకు - తనవాళ్ళకు చేస్తే ఏముంది గొప్ప ! పరాయి వాళ్ళకు చేయాలి - బీద ప్రజలకు చేయాలి - అప్పుడే పేరు, ప్రతిష్ఠ - వచ్చే ఎన్నికల్లో ఆమె టికెట్టు గ్యారంటీ !" విశ్వం చెప్పాడు తన్మయత్వంతో.

" పోనీలేరా ! మీ తమ్ముళ్ళనన్నా పిలిపించు అమెరికానుంచి" నారాయణ హీనస్వరంతో అన్నాడు.

" నీ తృప్తి కోసం సెల్ చేస్తాను..." అంటూ విశ్వం సెల్ కొట్టాడు అమెరికాకు.

అటు లైన్ రాగానే కాసేపు కుశల సమాచారాలు ముచ్చటించాడు. " రేయ్ రఘూ ! ముఖ్యంగా సెల్ చేసింది దేనికంటే నాన్నకు సీరియస్‌గా ఉంది - ఆపరేషను కూడా అయింది - అయినా డాక్టర్లు పెద్దగా హోప్సు ఇవ్వడం లేదు. నాన్న - అమ్మ నిన్ను చూద్దామంటున్నారు - వెంటనే వచ్చేస్తావా?" అడిగాడు.

" ఇప్పుడా! రెండు సార్లు రావాలంటే కష్టంగదా ! ఒకేసారి పోయింతర్వాత ఒక రోజు వీలు చూసుకుని వస్తాలే" చెప్పాడు రఘు.

" గుడ్ డెసిషన్ - ఖర్చులు దండుగ - వ్యాపారాలు దండుగ - సరే అమ్మతో మాట్లాడు -" అంటూ విశ్వం తన సెల్ తల్లికిచ్చాడు.

అమె మాట్లాడుతుండగా సెక్రటరీ లోపలికి వచ్చింది -

" ఎక్స్క్యూజ్ మీ సార్ - మీరు ఇక్కడ చాలా సేపు స్పెండ్ చేశారు మీకోసం చాలా మంది వెయిట్ చేస్తూ ఉంటారు- ఎన్నో ఫోన్ కాల్స్ వచ్చాయి- అన్నీ పెండింగులో ఉంచాను." చిరునవ్వుతో చెప్పింది.

" ఓ సారీ ! నేను సెంటిమెంట్ ఫూల్‌నయిపోయి ఇక్కడే ఉండిపోయాను వస్తున్నాను - పద!" విశ్వం సెల్ తీసేసుకున్నాడు తల్లి దగ్గర్నుంచి.

" డాడీ ! డోంట్‌వర్రీ - మాగ్జిమమ్ ఏ మవుతుంది- పోతాం అంతే గదా ! బీ బ్రేవ్ ! నేను ఇక్కడ లేకపోయినా - నా వాళ్ళు అన్నీ చూస్తూ ఉంటారు..."

జాగ్రత్తలు చెప్పి వచ్చేశాడు విశ్వం బయటకు.

" వీడికి చదువు చెప్పించడం - రెసిడెన్షియల్ స్కూళ్ళల్లో - కాలేజీల్లో చేర్పించి చదువు చెప్పించడం - నే చేసిన తప్పు." బాధపడ్డాడు.

ఓ వారం రోజుల తర్వాత నారాయణ కన్ను మూశాడు.

భౌతి కాయాన్ని ఆయన ఊరికి తీసుకుపోయారు... విశ్వం వెంటనే వెళ్ళిపోయాడు అక్కడికి... అమెరికా నుండి కొడుకులు కూడా బయలు దేరారు.

కాని - చంద్రకళ మాత్రం సరిగ్గా అంత్యక్రియలప్పుడు హాజరయింది సినిమా హీరోయిన్‌లా అలంకరించుకుని.

ఆ తర్వాత నారాయణ గురించి చాలా ఊళ్ళల్లో సంతాపసభలు ఏర్పాటు చేశారు... విశ్వం అన్నింటికి అటెండు అయ్యాడు. చాలా చోట్ల చంద్రకళ నారాయణ గొప్పతనం గురించి గంటలు గంటలు అనర్గళంగా ఉపన్యాసం దంచింది.

నారాయణ పేరుమీద ఒక ఛారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేశారు. దేశం నలుమూలల నుండి చందాలకోసం పిలుపు యిచ్చాడు విశ్వం. ఆ ట్రస్టు ఆశయం వృద్ధులకు సాయం చేతడం- బీద పిల్లలకు చదువులు చెప్పించడం వగైరా.

లక్ష్మీదేవి మళ్ళీ తన ఊళ్ళో ఒంటరిదై పోయింది. ఆమె బాధను పంచుకునే నాథుడు ఎవరూ లేరు.

పనోళ్ళు - దూరపు బంధువులు ఇంటి నిండా ఉన్నారు కాని... ఆమె ఎందుకో ఒంటరితనం ఫీలవుతూ ఉంటుంది.

ఇంత ఆస్థిపాస్తులు లేకుండా మధ్యతరగతి జీవితాలైనా బాగుండేవి తమవి అనుకుని అప్పుడప్పుడు బాధపడ్తూ ఉంటుంది. తన కొడుకులు కోడళ్ళు కలిసి మెలిసి ఉండేవాళ్ళు పేదరికంలో అని భావిస్తూ ఉంటుంది.

ఏది ఏమైనా ఆమె చెవులు ఒక తియ్యటి మాట కోసం ఓ చల్లటి పిలుపు కోసం ఆమె కళ్ళు ఇంకా ఎదురు చూస్తూనే ఉన్నాయి.

గిట్టని బంధువులు కొందరు నారాయణ సన్‌స్ట్రోక్‌తో చనిపోలేదు. చూసేవాళ్ళు లేక చనిపోయారని చెవులు కొరుక్కుంటున్నారు.

ఎండ దెబ్బకాకపోయినా కొడుకు ఎడబాటు దెబ్బ తగిలింది మరి.

- తేజ 28-3-2008